కర్నూలు | నంద్యాల
వార్త
3 నవంబర్ 2022 గురువారం పేజీలు 4

# వచ్చే 8నెలల్లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి..

- ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపకపోతే చర్యలు తప్పవు
- సబ్‌కలెక్టర్,ఆర్డీఓలు డిఎల్‌డిఓలు,ఇంజనీరింగ్ అసిస్టెంట్ వారిగా రెగ్యులర్‌గా సమీక్షలు చేయాలి
- హౌసింగ్,గ్రామ,వార్డు సచివాలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్





**కర్నూలు,నవంబరు 2,ప్రభాతవార్త బ్యూరో :** పేదలందరికి ఇళ్ల పథకం కిందచేపడుతున్న ఇళ్లనిర్మాణాలను వచ్చే 8నెలల్లోపు పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ పురోగతిపై కలెక్టరేట్‌లోని సునాయన ఆడిటోరియంలో రెవెన్యూ డివిజినల్ అధికారులు,మున్సిపల్ కమీషనర్లు, డిఎల్‌డిఓలు మండల స్థాయి స్పెషల్ అధికారులు,హౌసింగ్ ఇంజనీర్లు పురోగతిలో వెనుకబడి ఉన్న గ్రామాలకు చెందిన సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ఈ సందర్భంగా అజయ్‌జైన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 30లక్షల మందికి ఇంటి పట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇందులో మొదటివిడతలో 18లక్షల ఇళ్లను నిర్మించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 47,529ఇళ్లు మంజూరు కాగా కేవలం 3515ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి మండలంలో 15నుండి 20సచివాలయాలు ఉన్నాయని,10మంది శాశ్వత ఉద్యోగులతో మంచి సచివాలయ వ్యవస్థ ఉందని తెలిపారు. ఇందులో ఇంజనీరింగ్ అసిస్టెంట్,డిజిటల్ అసిస్టెంట్,వెల్‌ఫేర్ అసిస్టెంట్,విఆర్ఓ,పంచాయతీ సెక్రటరీ,సర్వేయర్ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఉద్యోగులతో పాటు ప్రతి 50ఇళ్లకు ఒక వాలంటరీ కూడ ఉన్నారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో దాదాపు 100ఇళ్లు ఉంటాయని ఏడాది పూర్తయినా ఇంతమంది సిబ్బంది ఉండికూడ కనీసం 100ఇళ్లు ఎందుకు నిర్మించలేకపోతున్నారని సచివాలయ సిబ్బందిని స్పెషల్ సిఎస్ ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపకపోతే చర్యలు తప్పవని ఆయన సంబంధిత అధికారులను ఘాటుగా హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరుతో పాటు ఇళ్లుకట్టుకోవడానికి రూ.1.80లక్షలు అందించడమే కాక స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.35వేలు అదనంగా రుణం మంజూరు చేయిస్తున్నామని తెలిపారు. సబ్సీడీ ధరతో సిమెంటు,ప్రతి ఇంటికి 20టన్నుల ఇసుకను ఉచితంగా ఇవ్వడంతో పాటు స్టీల్ కూడ బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. సబ్ కలెక్టర్,ఆర్డీఓలు,డిఎల్‌డిఓలు లేఔట్‌వారిగా సమీక్షించాలని ఆదేశించారు. ఎంపిడిఓలు,సచివాలయ సిబ్బంది,హౌసింగ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది ఈ అంశంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. ఇళ్లు నిర్మించుకోకపోతే మంజూరు అయిన ఇళ్లు రద్దు అవుతాయని,ఆ విషయాన్ని లబ్దిదారులకు తెలియజేయాలని సూచించారు. లేఔట్లలో విద్యుత్,నీటి సరఫరా,అప్రోచ్ రోడ్లను కూడ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల ఎస్ఈలకు సూచించారు. సంఘాల్లో లబ్దిదారులందరికి రూ.35వేలు రుణం మంజూరు చేయించాలని డిఆర్‌డిఎ,మెప్మా పిడిలను ఆదేశించారు. గత 7నెలల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణం కోసం రూ.5వేల కోట్లు ఖర్చు చేశామని ప్రతిరోజు దాదాపు రూ.23కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. థర్డ్ ఆప్షన్ కింద నిర్మిస్తున్న లబ్ధిదారులందరికి ఐసిఐసిఐ బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించాలన్నారు. థర్డ్ ఆప్షన్ కింద నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్లతో కూడా ఆయన మాట్లాడారు. త్వరితగతిన ఇళ్లను నిర్మించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పురోగతిలో వెనుకబడి ఉన్న గ్రామాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంపిడిఓలతో సమీక్షించారు. 80శాతం సమస్యలు పరిష్కరించగలిగినవే ఉన్నాయన్నారు. వీటిని వెంటనే పరిష్కరించి ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. పియంఏవై గ్రామీణ కింద మంజూరైన 9638ఇళ్లకు కూడ త్వరితగతిన రిజిస్ట్రేషన్,జియోట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. డిసెంబరులో అందించనున్న జగనన్న తోడు పథకం కింద రుణాల మంజూరు ప్రక్రియ పూర్తి చేయించాలని డిఆర్‌డిఏ పిడిని ఆదేశించారు. సచివాలయాల్లో ప్రతిరోజు 3గంటల నుండి 5గంటల వరకు స్పందన నిర్వహించాలని స్పెషల్ సిఎస్ ఆదేశించారు. డిఎల్‌డిఓలు రెగ్యులర్‌గా సచివాలయాలను తనిఖీ చేయాలని అధికారులందరు హౌసింగ్, గ్రామ,వార్డు సచివాలయాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమీషనర్ భార్గవ్‌తేజ,ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్,హౌసింగ్ పిడి వెంకటనారాయణ,ప్రొబేషన్ డిప్యూటీ కలెక్టర్లు ఎన్ మనోజ్‌రెడ్డి,జివి రమణకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి కన్నుమూత

- ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- తీవ్ర విషాదంలో కుటుంబ సభ్యులు, అభిమానులు
- చల్లా రామకృష్ణారెడ్డి వారసుడిగా రాజకీయాల్లోకి ప్రవేశం
- ఎమ్మెల్సీ చల్లా మృతికి వైసీపీ నేతల సంతాపం
- అంత్యక్రియలకు సీఎం హాజరు



**అవుకు,నవంబర్2,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు చల్లా భగీరథరెడ్డి(46)హైదరాబాద్‌లోని ఏఐజీ అనే ప్రముఖ ఆసుపత్రిలో నియో నియాకు చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు.వివరాల్లోకి వెళితే ఎమ్మెల్సీ చల్లా గత మూడు రోజుల నుంచి ఆరోగ్యం సరిగాలేక పోవడంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక పరిస్థితి విషమించడంతో బుధవారం కన్నుమూశారు. గురువారం ఆయన స్వగ్రామ మైన అవుకులో అంత్యక్రియలు నిర్వ హిస్తున్నట్లు అధికారులు తెలియ జేశారు. చల్లా భగీరథరెడ్డి మృతికి వైసీపీ నేతలు సంతాపం తెలియ జేశారు.

చల్లా పేరంటే ప్రజలకు అండ.ప్రజలకు పరిచయంలేని పేరు చల్లా. కోవెలకుంట్ల, డోన్, పాణ్యం, బనగాన పల్లె నియోజకవర్గాలలోని ప్రజలకు అండగా ఉండే పేరు చల్లా. ప్రజాసేవకే తండ్రి చల్లా, తనయుడు జీవితాలను అంకితం చేశారు. అటువంటి మహాను భావుడైన చల్లా రామకృష్ణారెడ్డి తనయుడు చల్లా భగీరథరెడ్డి ఇకలేరు.



2లో



# అకిరా సీడ్స్.. అట్టర్ ప్లాప్..!



- అప్పుడు వర్షం రాక(ఇప్పుడు వచ్చి) నష్టం
- ప్రధాన కంపెనీకి చెందిన విత్తనాలు నకిలీ..?
- రైతన్నకు మూడు దెబ్బలు
- ఫర్టిలైజర్ షాపుల ముందు ధర్నాలు
- దాడులు నిర్వహించడంలో వ్యవసాయ అధికారులు విఫలం..?

**ఆదోని రూరల్, ప్రభాతవార్త :**

రైతన్నలు సాగు చేస్తున్న పంటలు రోజురోజుకు పెట్టుబడుల భారం పెరుగుతున్నాయి తప్ప దిగుబడులు రావడం లేదని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. భూమాతను,వర్షాన్ని నమ్ముకుని రూ.లక్షల్లో అప్పు రుణాలు తీసుకుని పంట సాగు చేస్తున్నారు. అయితే రైతన్నలు దళారుల చేతిలో అడుగడుగున మోసపోతున్నారు. ఒకవైపు నాసిరకం విత్తనాలు మరోవైపు వర్షాన్ని, భూమిని నమ్ముకుని పంట సాగు చేసి విత్తనాలు వేస్తే సకాలంలో వర్షాలు రాక విత్తనాలు సరిగా మొలకెత్తక విత్తనాలకు వర్షాలు సకాలంలో రాక అరకొర విత్తనాలు మొలకెత్తి అనుకున్న స్థాయిలో దిగుబడులు రాక పంట చేతికందే సమయంలో అధిక వర్షాలు కురిసి నష్టం. ఫర్టిలైజర్ షాపు యజమానులు క్రిమిసంహారక మందులు నకిలీ ఇవ్వడంతో ఆ మందులను పొలాలకు పిచికారి ఇలా చెప్పుకుంటూ పోతే రైతన్నలు అడుగడుగున నష్టపోతున్నారు.

గత ఏడాది పత్తి ధర అధికంగా ఉండడంతో రైతన్నలు పత్తిపై మక్కువ చూపి పత్తి పంటను ఎక్కువమంది సాగుచేశారు. ఈ ఏడాది విషయానికొస్తే మొదట్లో పత్తి ధర రూ.12700లుపైచిలుకు ఉండటంతో రైతన్నలు ఎక్కువ శాతం పత్తిని సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపారు. దీంతో పత్తి విత్తనాలు ధరను,ఫర్టిలైజర్స్ సీడ్స్ షాపు యజమానులు ధర విచ్చల విడిగా అమ్మి సొమ్ము చేసుకున్నారు. కొన్ని ప్రధాన కంపెనీలు సీడ్స్ విధానాలను భువనేశ్వర్, జయకృష్ణ, జయలక్ష్మి,మోహన్ ట్రేడర్స్ సీడ్స్ షాపులలో అకీరా, తడాఖా, ఆదిత్య, రాధిక,వేద,తులసి సీడ్స్ తదితర కొన్ని విత్తనాలను దుకాణ యజమానులు అధిక ధరలకు అమ్ము కున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విత్తనాలు విక్రయించిన తర్వాత రైతులకు బిల్లులు కూడ ఇవ్వకుండ అమ్ముకన్నట్లు ఆరోపణ. మీకు అవసరమైతే తీసుకోండి లేకపోతే వద్దు మేమైతే బిల్లు ఇవ్వమంటూ ఎమ్మార్పీ ధరకు అడిగిన రైతులకు విత్తనాలు లేవు పో అని పంపినట్లు వినికిడి. విత్తనాలు అమ్మకం విషయంలో అందిన కాడికి అందినట్లు అమ్మి సొమ్ము చేసుకున్నట్లు రైతన్నలు ఆరోపిస్తున్నారు.

**అకిరా అట్టర్ ప్లాప్ :** ప్రధాన కంపెనీకి చెందిన అకీరా పత్తి విత్తనాలు గత ఏడాది సాగు చేసిన రైతులకు అధిక దిగుబడులు అందించడంతో రైతన్నలు ఎక్కువ శాతం ఆ విత్తనాలపై మక్కువ చూపి ఆ విత్తనాలను సాగు చేశారు. అదే విత్తనాలు ఆసరాగా తీసుకున్న ఫర్టిలైజర్ షాపు యజమానులు అమాంతంగా రేట్లు పెంచి విచ్చల విడిగా రైతన్నలకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. అధిక ధరలైనా పర్లేదు పంట దిగుబడి అధికంగా వస్తుందని ఆశతో రైతన్నలు ధరలు లెక్కచేయకుండ చెప్పిన ధరలకే కొనుగోలు చేసి పత్తిని సాగు చేశారు. కానీ ఆ పత్తి విత్తనాలు రైతన్నలు ఆశించిన స్థాయిలో రాక,పంట దిగుబడి రాక ఈసారి అకీరా పత్తి విత్తనాలు అట్టర్ ప్లాప్ అయ్యాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 2లో

# నేడు అవుకు రానున్న ముఖ్యమంత్రి

**నంద్యాల, నవంబరు 2, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు చల్లా భగీరథ్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డి నేడు అవుకు పట్టణానికి రానున్నారు. అనారోగ్యంతో మృతిచెందిన శాసన మండలి సభ్యులు చల్లా భగీరథ్‌రెడ్డి పార్థివదేహానికి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లను సిద్దం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా పోలీసులు, రెవిన్యూ అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లను చురుగ్గా కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి రాకసందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

# కర్నూలు దిశ మహిళ పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ..

: పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కారం చేయాలి....
: మహిళలపై నేరాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలి...
: దిశ పోలీస్ స్టేషన్ మహిళలకు అండగా నిలవాలి...

**కర్నూలు క్రైమ్,నవంబర్,02, ప్రభాతవార్త :** కర్నూలు దిశ మహిళా పోలీసులు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. దిశా పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు సలహాలు సిబ్బందికి తెలియజేశారు. అన్ని గ్రేవ్ కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయో కోర్టులో త్వరితగతిన ముద్దాయిలను హాజరు పరచి కోర్టు వారికి సహకరించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడారా. కేసుల తీవ్రతను బట్టి త్వరితగతిన పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. బాధిత మహిళలు దిశా పోలీసుస్టేష న్ కు వచ్చినప్పుడు వారికి సైబర్ కవచ్ యొక్క ఉపయోగాలను తెలియజేయాలన్నారు. బాధిత మహిళల మొబైల్ ఫోన్‌లను సైబర్ కవచ్‌తో స్కాన్ చేసుకోవాలని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాటు దిశా పోలీసు స్టేషన్ డిఎస్పీ వెంకటాద్రి సిఐ కళా వెంకటరమణ ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.





# ఇసుకను తోడేస్తున్నారు..!

- ఇసుక మాఫియకు అడ్డుకట్ట వేయలేరా..
- హంద్రీ నదీ తీర ప్రాంతాలకు వేసవిలో ప్రజలకు తాగు నీటి వెతలే..!

హంద్రీ నదీ తీర ప్రాంతాలలో ఎడా పెడా లేకుండా ఇసుకను భారీగా తోడేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాపై అధికారుల చర్యలు లేక పోవడంతో పేట్రేగి పోతున్న ఇసుక మాఫియా అడ్డుఅదుపు లేకుండా చెలరేగి హంద్రీ నదిలో ఎక్కడ పడితే అక్కడ ఇసుకను తోడేస్తున్నారు. రైతులబోర్ల దగ్గర ఇసుకను తోడేస్తుంటే అక్కడ ఉన్న రైతులు అడ్డు చెబితే రైతులనే ఇసుక మాఫియా బెదిరిస్తోంది. తమకు పోలీసుల తోడ్పాటు, అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని ఇక మమ్మల్ని ఎవ్వరూ ఆపలేరని బెదిరించడం గమనార్హం.

**కోడుమూరు, నవంబర్ 2 (ప్రభాతవార్త) :** రైతుల బోర్లు, కోడు మూరుతో హంద్రీ నదీ తీర ప్రాంతాలైన వర్కూరు,లింగందిన్నే, ముడుములగుర్తి, గోరంట్ల,అనుగొండ గ్రామాలలో ప్రజలకు తాగు నీటికి ఉపయోగిస్తున్న మంచి నీటి పథకాల దగ్గర కూడా ఇసుకను హరించి వేస్తున్నారు. ఇసుక మాఫియా వల్ల ఇప్పటికే హంద్రీ నదిలో ఇసుక వనరులను ఆవిరైపోయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం జీవ నధుల దగ్గరనే ఇసుకకు అనుమతులు ఇచింది కానీ హంద్రీ నది, వాగులు,వంకలలలో ఎట్టి పరిస్థితుల్లో ఇసుకను వినియోగించరాదని నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను అమలు పర్చాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోక పోవడం శోచనీయం. అడ్డు చెప్పే వారు ఎవ్వరూ లేక పోతే దొంగలు ఊళ్లు పంచు కొని దోచుకున్న చందంగా నేడు కోడుమూరులో ఇసుక దోపిడి చేస్తూ ఎవ్వరికీ వారు వాటాలు వేసుకొని జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీతో ప్రభుత్వ యంత్రాం చేతులు కలపక పోతే ఇసుక మాఫియా ఏ ధైర్యంతో హంద్రీ నదిలో కాలు మోపుతోందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

2లో

# తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా ముందుకు వెళ్దాం..!

**- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి**



**కల్లూరు,నవంబర్2,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి మన ప్రియతమ నాయకులు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని అందుకు అందరు సైనికుల్లా పనిచేయాలని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఈ మేరకు కల్లూరులోని గౌరు వెంకటరెడ్డి స్వగృహంలో జిల్లా బీసీ సాధికార అనుబంధ కమిటీల పై గౌరు వెంకటరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ పన్నులు చెల్లించలేక పేద,మధ్య తరగతి కుటుంబాలు తల్లడిల్లుతున్నాయని నిత్యవసర వస్తువులు విపరీతంగా ధరలు పెరగడంతోపాటు ప్రజలు కొని తినలేని పరిస్థితి నెలకొన్నాయని విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్ మెంట్‌లేక కొందరు విద్యార్థులు విద్యకు దూరమైతే మరికొందరు ఇతర రాష్ట్రాలకు చదువుకోవడానికి వెలుతున్నారని చదువుకున్న యువతకు ఉద్యోగాలులేక, ఉపాధిలేక తల్లిదండ్రులకు భారమై ఒకపక్క తల్లడిల్లుతుంటే వైసీపీ ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లకు నిధులు ఇచ్చి ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం బాధ్యత నుండి తప్పుకోడం చాలా దుర్మార్గమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం చాలా దిగజారిపోయిందని ఇప్పటికైనా ప్రజలు తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవాలని టీడీపీ అధికారంలోకి వస్తే అందరికి సమానంగా న్యాయం జరుగుతుందని అంతేకాకుండా యువత ఉద్యోగాలు వస్తాయని నూతన పరిశ్రమలు వస్తాయని అలాగే మూడు రాజధానులకు మద్దతు ఇవ్వకుండా అమరావతికే మద్దతు ఇవ్వాలని గౌరు వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు,ప్రజా వైద్యశాల మల్లికార్జున మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేశామంటూనే కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా బీసీలను బిచ్చగాళ్లను చేసిందని గౌరు వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన గౌరు వెంకటరెడ్డి ఈ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే టీడీపీకి బీసీలు అనుబంధ కమిటీలు బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరి పై ఉందని పార్టీ అనుబంధ కమిటీల్లోని ప్రతిఒక్కరు కష్టపడి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చుకుని నారా చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో నంద్యాల జిల్లా బెస్త సాధికార కమిటీ అధ్యక్షులు పుట్టగురు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# శ్రీశైలం మల్లన్న హుండి.. ఆదాయం రూ.2.41.కోట్లు

**శ్రీశైలంప్రాజెక్టు, నవంబర్02, ప్రభాతవార్త** శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్ల ఉభయ దేవాలయాల హుండిల లెక్కింపు బుదువారంనాడు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న ఆద్వార్యంలో లెక్కింపును నిర్వహించడం జరిగింది. ఈక్రమంలోనే దేవస్థానానికి రూ.2,41,95,778/-ల నగదు రాబడిగా లబించింది. ఈ హుండి ఆదాయాన్ని భక్తులు గత 19 రోజులలో సమర్పించడం జరిగింది. ఈ నగదుతో పాటు 128 గ్రాముల బంగారు,03 కేజీల 790 గ్రాముల వెండి లబించాయి. అదే విధంగా 299 యు.ఎస్.ఏ డాలర్లు,కెనడా డాలర్లు 120,యు.ఎ.ఇ.ధిరహమ్స్ 15,ఆస్ట్రేలియా డాలర్లు 30, మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈహుండి లెక్కింపులో లబించాయి. కాగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు బరుగురెడ్డి పద్మజ,డాక్టర్ కనకదుర్గ,మండలి ప్రత్యేక ఆహ్వానీతులు తన్నీరు ధర్మరాజు, అన్ని విబాగాల అదికారులు, సిబ్బంది, మరియు శివసేవకులు ఈ హుండి లెక్కింపులో పాల్గొన్నారు.



# కాంట్రాక్టు ఉద్యోగి క్రమబద్ధికరణకు లోగుట్టు సూత్రదారులేవరు..?

: ఉన్నాతాధికారి పరిశీలనలో వెలుగు చూసిన వైనం
: సూత్రదారిపై చర్యలకు.. ఉద్యోగుల మల్లగుల్లాలేందుకో..!?

**శ్రీశైలంప్రాజెక్టు,నవంబర్02, ప్రబాతవార్త:** అష్టధశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహపుణ్యక్షేత్రంలో కొందరి ఉద్యోగుల తీరును మల్లన్న స్వామి గుట్టురట్టు చేస్తున్నాడు.నా చెంత నీ లోగుట్టు అటలు సాగవంటూ బట్టబయలు చేస్తున్నాడు. శ్రీగిరిక్షేత్రంలో ఉన్నాతాధికారి సూచనలు లేకుండానే ఓ ప్రబుద్దుడైన ఉద్యోగి కంకణాల తయారి విబాగంలో పనిచేసే మరో కాంట్రాక్టు లేబర్ ఉద్యోగిని క్రమబద్ధికరణకు ఎకంగా ఫైల్‌ను తయారు చేసి ఉన్నాతాధికారి అనుమతికి ఉంచడంలో లోగుట్టు రహస్యం నడిపిన దానిలో సూత్రదారులేవరు...? పాత్రదారులేవరు..? రన్నది అ శ్రీశైల మల్లన్న గుట్టు విప్పాల్సిందే. ఈ కథకు అంతా ఓ జూనియర్ అసిస్టెంట్ మరో జూనియర్ అసిస్టెంట్ సలహాతో ఉన్నాతాదికారి అమొదంకు ఫైల్‌ను నడపాడని విశ్వసనీయ సమాచారం. ఈ గుట్టును బట్టబయలు చేసే క్రమంలో సాక్ష్యత్తు ఆ మల్లనే ఉన్నాతాధికారి రూపంలో గుట్టును పసిగట్టి క్షేత్రంలో ఇంత మంది కాంట్రాక్టు ఉద్యోగులుండగా ఈఉద్యోగికే క్రమబద్ధికరించమని ఎవరు చెప్పారు..? అని అరా తీయడంతో వాస్తవం వెలుగు చూసినట్లు క్షేత్రంలో పూకార్లు ఊపందు కుంటున్నాయి. ఈ కాంట్రాక్టు ఉద్యోగి వద్ద సూత్రదారులేమైన రూకలు పుచ్చుకున్నారా..? ఈ తతంగం వెనుక సూత్రదారులు తపన పడాల్సిన అవసరం ఏముంది...? ఇందులో సూత్రదారులకు ప్రయేజనం ఉందా..? లేదా..? అన్న సందేహలు కూడా ఉద్యోగుల్లో ఉత్పన్నమౌతున్నట్లు గుసగుసలు వినబడుచున్నాయి. క్షేత్ర ఉన్నాతాదికారి అదమరచి సంతకం చేస్తే ఇక దేవదాయశాఖ ఉన్నాతాదికారికి ఫైలును నడిపేందుకు సూత్రదారులు ఎకంగా పథకం రచించినట్లు లోగుట్టుగా ఉద్యోగులు గుసగుసలాడుతున్నట్లు సమాచారం. సమస్య వెలుగు చూసి రమారమి 10 నుండి 15 రోజులు కావస్తున్నా ఉన్నాతాదికారి అనుమతి లేకుండా ఫైల్‌ను నడిపిన ఉద్యోగిపై చర్యలకు ఉపక్రమించడంలో అదికారుల మల్లగుల్లలు పడడంలో అంతర్యమేమిటన్నది వెలుగు చూడాల్సి ఉంది. కాగా క్షేత్రంలోని ఉద్యోగుల్లో తప్పిదాలు జరిగితే వెంటనే చర్యలకు ఉపక్రమించే అదికారులు ఈ విషయంలో కాలయాపాన చేయడంపై ఎవరి పలుకుబడిని ప్రయేగిస్తున్నారు అనే కోణంలో కూడా పలు అనుమానాలుకు దారితీస్తుంది. ఇందులో తీగా లాగితే డొంక కదులుతుందన్న వైనం ఏమైన అదికారులను వెంటాడుతుందా...? చర్యలకు ఉపక్రమిస్తే సూత్రదారుల నుండి, పాత్రదారుల నుండి పలుకుబడి ఒత్తిడి ఏమైన లబిస్తుందా...? అన్న సందేహంలో చర్యలకు ఉపక్రమించడం లేదా...? ఈ ప్రశ్నలన్నింటికి సమాదానం వెచిచూడాల్సిందే.



# అకిరా సీడ్స్ అట్టర్ ప్లాప్..!

(మొదటి పేజీ తరువాయి)

**అప్పుడు వర్షం రాక..ఇప్పుడు వచ్చి నష్టం :** ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావంతో ముందస్తు వర్షాలు రావడంతో రైతన్నలు పంటలను జూన్ నెలలోనే విత్తనాలు వేసి సాగు చేశారు. మొదట్లో వర్షాలు వచ్చినా ఆ తర్వాత వరుణుడి జాడే లేకపోవడంతో వేసిన పంటలు వర్షం రాకపోవడంతో దెబ్బతిన్నాయి. మళ్లీ పంటలు దెబ్బతిన్న తర్వాత అధిక మోతాదులో వర్షాలు రావడంతో రైతన్నకు రావాల్సిన కొంత దిగుబడి కూడ మట్టిపాలు అయ్యింది. దీంతో రైతన్నకు మొదటరాక తర్వాత వచ్చి రైతన్న పూర్తిగా నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు నకిలీ పత్తివిత్తనాలు సాగు చేయడంతో అటు వర్షం రాక.. ఇటు వచ్చి..మళ్లీ నకిలీ విత్తనాల దెబ్బ ఇలా రైతన్నలకు దెబ్బ మీద దెబ్బ అంటూ పూర్తిగా నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడిందంటూ రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు ఫర్టిలైజర్ షాపులపై దాడులు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు.

**రైతన్నకు మూడు దెబ్బలు :** రైతన్నలు వ్యవసాయమే పెట్టుబడి లక్ష్యంగా భూమిని, వర్షాన్ని నమ్ముకుని పంట సాగు చేస్తారు. సమాజంలో అమ్మే ప్రతి వస్తువుకు కంపెనీలే ధరలు నిర్ణయిస్తాయి. కానీ రైతన్న పండించిన పంటకు మాత్రం దళారులే ధరలు నిర్వహిస్తారు. మట్టిని నమ్ముకుని రైతన్న వ్యవసాయం చేస్తారు కానీ నేటి ఎరువుల మందులు అమాంతంగా పెరగడంతో వ్యవసాయం భారంగా మారింది. ఒక్క రోజుకూలి కోసం ఒక కూలీకి రూ.300లు ఇచ్చుకోవాల్సిన దుస్థితి. అలాగే భూసా సాగు చేసేందుకు ట్రాక్టర్,కాడెద్దులకు రూ.వేలల్లో బాడుగలు ఇవ్వాల్సి వస్తుందని అంత చేసినా పంట దిగుబడి వస్తుందో..లేదో..అన్న ఆశతో పంట సాగుచేస్తే ఒకవైపు వర్ష ప్రభావం..మరోవైపు నకిలీ విత్తనాలు..ఇంకోవైపు దిగుబడి రాక..వచ్చిన ధాన్యానికి గిట్టుబాటు ధర దొరకక ఇలా రైతన్నకు అడుగడుగునా దెబ్బల గరిడి తప్పడం లేదని రైతన్నలు వ్యవసాయం చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. పత్తి సాగు చేసే సమయంలో పత్తి ధర దాదాపు రూ.12700లు ధర పలికింది. కానీ ప్రస్తుతం పత్తిధర గరిష్టం రూ.8600లు మాత్రమే ధర పలకడంతో రైతన్నకు అక్కడ దిగుబడి రాక ఇక్కడ గిట్టుబాటు ధర దొరకక రెండు విధాలుగా రైతన్నకు పెట్టుబడి భారం అవుతుంది. ఇలానే జరిగితే రైతులు వ్యవసాయం మానేస్తే సమాజంలో ప్రజలకు ఆహారం,ప్రధాన ధాన్యాలు దొరకక ధాన్యం ధరలు అధికంగా పెరిగి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందేమో అని విశ్లేషకులు అంటున్నారు.

**దాడులు నిర్వహించడంలో వ్యవసాయాధికారులు విఫలం..? :** ఫర్టిలైజర్ షాపులపై వ్యవసాయ అధికారులు దాడులు నిర్వహించడంలో విఫలం చెందారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఫర్టిలైజర్ షాపులలో పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయస్తూ అంతేకాక నకిలీ విత్తనాలు కూడ అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దానికి తోడు క్రిమి సంహారక మందులు కూడ నకిలీ మందులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని నిబంధనలకు విరుద్ధంగా కూడా కొన్ని బయో మందులు ఫర్టిలైజర్ షాపులలో విక్రయించి మూడు పూలు..ఆరు కాయలుగా..వారి వ్యాపారం కొనసాగుతుందంటూ రైతన్నలు వాపోతున్నారు. ఇలా విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు విక్రయించడంతో రైతన్నలు నష్టపోతున్నారు. కొన్ని ఫర్టిలైజర్ షాపుల్లో అయితే మందులపై అవగాహన కూడా లేని వారు షాపులు నడుపుతూ పంటకు వాడాల్సింది ఒకటైతే మరొక మందునివ్వడంతో రైతన్నల పంటలు దెబ్బతిన్న సంఘటనలు కూడా ఉన్నాయి.ఇలా జరిగిన రైతన్నలకు ఆర్థిక సహాయం అందచేసి సమస్యను బయటకు పోకుండ కప్పిపుచ్చిన సంఘటనలు కూడా లేకపోలేదు. ఏదేమైనా రైతన్నలకు నకిలీ విత్తనాలు,మందులు అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపులపై దాడులు చేసి వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని రైతన్నలు కోరుతున్నారు. ఆదోని నియోజకవర్గంలో పంట సాగు 33165హెక్టార్లలో పంట సాగు చేశారు. ఇందులో వేరుశనగ 815, ఆముదం 136,ఎండుమిరప 5281,ఉల్లి 407,పత్తి 24707హెక్టార్లలో మిగతావి తదితర పంటలను సాగు చేశారు. ఆదోని నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో పత్తి పంటను రైతులు సాగు చేశారు.

**రైతన్నలకు ఆత్మహత్య దిక్కు..? :** రైతులు వేలకు వేలు ఖర్చు చేసి పంట సాగు చేస్తే సకాలంలో వర్షాలు రాక మరోవైపు నకిలీ విత్తనాల బెడదతో పంట దిగుబడులు సరిగా రాక వర్షాలు సకాలంలో రాక వేలకు వేలు ఖర్చు చేసి పంట సాగు చేస్తే పంట సాగు చేసిన ఖర్చులకు కూడ రాకపోవడంతో తెచ్చుకున్న పెట్టుబడి అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలే శరణ్యమని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా ప్రభుత్వం చొరవ చూపి రైతులకు పంటనష్ట పరిహారం అందిస్తే తప్ప రైతులు అప్పుల బారి నుండి బయటపడని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందా లేదా అని వేచిచూడాల్సిన పరిస్థితి.

**అకీరా నట్టేట ముంచింది :** అకీరా విత్తనాలు కొనుగోలు చేస్తే ఆ విత్తనాలు తమ పంటను నట్టేట ముంచాయంటూ చిన్నహరివాణం గ్రామానికి చెందిన రైతు భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు ఫర్టిలైజర్ సీడ్స్ షాపుపై దాడులు నిర్వహించడంలో విఫలం చెందారంటూ రైతులు ఆరోపిస్తున్నారన్నారు.

**అందినకాడికి(అందినంత)దోచుకున్నారు :** అకీర పత్తి విత్తనాలు పంట దిగుబడులు ఎక్కువగా వస్తాయనే ఆశతో ఆ పత్తి విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేశామని ఆ విత్తనాలు మార్కెట్‌లో ఎక్కువ మంది రైతులు కొనుగోలుకు మక్కువ చూపడంతో కొంతమంది కొన్ని ఫర్టిలైజర్ సీడ్స్ షాపు యజమానులు రైతులకు అధిక ధరలకు విక్రయించి అందినకాడికి అందినంత దోచుకున్నారని నాగలాపురం గ్రామరైతు వీరేష్ వాపోయాడు.

**నివేదిక కోసం ప్రభుత్వం బృందాలు ఏర్పాటు చేసింది : వ్యవసాయాధికారి పాపిరెడ్డి**

జిల్లాలో రైతులు సాగుచేసిన పత్తిపంటపై నివేదికను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందని అందులో భాగంగానే జిల్లావ్యాప్తంగా గత నాలుగు రోజుల క్రితం ప్రత్యేక బృందాలు కర్నూలు జిల్లాలో పత్తిపంట నివేదిక కోసం మండలంలో పర్యటించి నివేదిక తీసుకెళ్తారని వారంలో నివేదిక రిపోర్టును వెల్లడిస్తారని రిజల్ట్ వచ్చిన తర్వాత ఏం చేయాలన్నది ప్రభుత్వమే నిర్ణయిస్తుందని ఏఓ పాపిరెడ్డి తెలిపారు. అలాగే ఫర్టిలైజర్ షాపులపై దాడులు నిర్వహిస్తున్నామని ఎవరైనా అధిక ధరలకు విక్రయించినట్లు రుజువైతే ఫర్టిలైజర్ షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామని అదేవిధంగా ఏవైన సందేహాలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు పైస్థాయి అధికారులకు రిపోర్టు పంపిస్తామని అన్నారు.

## ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం చల్లా భగీరథరెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించను న్నారు. అనారోగ్యంతో బాధపడుతూ గతనెల 25వ తేదిన చల్లా భగీరథరెడ్డి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చేరారు.మంగళవారం నుండి ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించ డంతో డాక్టర్లు వెంటిలేటర్ పై ఉంచి చల్లాకు మెరుగైన వైద్యం అందించారు. కాని అన్ని ప్రయత్నాలు విఫలంకా వడంతో బుధవారం ఎమ్మెల్సీ మృతి చెందారు.దివంగత వైసీపీ నేత,మాజీ ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణా రెడ్డికి ఇద్దరు కుమారులు మొదటి కుమారుడు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, రెండవ కుమారుడు చల్లా భగీరథరెడ్డి. చల్లా రామకృష్ణారెడ్డి వారసునిగా చల్లా భగీరథరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో చల్లా భగీరథరెడ్డి 2003 నుంచి 2009 వరకు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2007-2008 సంవత్సరాల మధ్య ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు. 2019 సంవత్సరంలో తండ్రి చల్లా రామ కృష్ణారెడ్డితో కలిసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీ చేరారు.చల్లా భగీరథరెడ్డి 1976 మే 28న జన్మించారు.ఆయన ఓయూ యూనివర్శిటీలో ఎంఏ పొలిటికల్ చదివారు.చల్లా భగీరథరెడ్డికి ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె శ్రీలక్ష్మితో వివాహం జరిగింది.చల్లా భగీరథరెడ్డి భార్య చల్లా శ్రీలక్ష్మి అవుకు జెడ్పీటీసీగా కొనసాగుతున్నారు.వీరికి ఇద్దరు కుమారులు జన్మించారు.మొదటి కుమారుడు చల్లా అభిషేక్‌రెడ్డి,రెండవ కుమారుడు జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డి. 2020డిసెంబర్ 31న చల్లా రామకృష్ణారెడ్డి కరోనా బారినపడి మృతి చెందారు.ఆ తరువాత మార్చి 21వ తేదిన ఆయన కుమారుడైన చల్లా భగీరథరెడ్డికి ఎమ్మెల్సీ పదవిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎన్నికయ్యారు. అనంతరం చల్లా భగీరథరెడ్డి ఎమ్మెల్సీగా 18నెలలు పార్టీకి సేవలు అందించారు.ఆ తరువాత నియోనియా వా ్యధితో బాధపడుతూ భగీరథరెడ్డి మరణించారు.దీంతో చల్లా కుటుంబం,అభిమానులు కన్నీరుమున్నీరవుతున్నారు.అలాగే అవుకు మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.గురువారం తెల్లవారుజామున చల్లా భగీరథరెడ్డి పార్థివదేహాన్ని అవుకు పట్టణానికి తీసుకురానున్నారు.సాయంత్రం అవుకులోని చల్లా ఫామ్‌హౌస్‌లో చల్లా భగీరథరెడ్డి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. చల్లా కుటుంబం టీడీపీ,కాంగ్రెస్ పార్టీలో పనిచేసి అనేక ప్రశంసలు పొందారని రాజకీయ నాయకులు తెలియజేశారు.చల్లా రామకృష్ణారెడ్డి స్వగ్రామం అవుకు మండంలోని ఉప్పలపాడు.చల్లా రామకృష్ణారెడ్డి తండ్రి చల్లా చిన్నపురెడ్డి,చల్లా రామకృష్ణారెడ్డి 1983లో పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీచేసి భారీ మెజార్టీతో గెలుపొందారు.అలాగే 1999సంవత్సరం,2004సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో కోవెలకుంట్ల నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు.అనంతరం 2009 సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో బనగానపల్లె నియోజకవర్గం నుంచి పోటీచేసి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి చేతిలో ఓడిపోయారు.చల్లా రామకృష్ణారెడ్డి 2014ఎన్నికల్లో టీడీపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి విజయంలో కీలకపాత్ర వహించారు.టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.2019 ఎన్నికల సమయంలో టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు.జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారు.2020లో చల్లా రామకృష్ణారెడ్డి కరోనాతో కన్నుమూశారు.దీంతో కుటుంబాన్ని పరామర్శించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి కుటుంబానికి అండగా నిలిచి చల్లా భగీరథరెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు.

## ఇసుకను తోడేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

**కోడుమూరులో ఎక్కడా .. చూసిన ఇసుక డంపులే... :**

పట్టణంలో ఏ వీధిలో చూసిన ఇసుక డంపులే దర్శనం ఇస్తున్నాయి. ఇలాంటి అవకాశం మళ్లీ రాదని అనుకున్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారంతా పోటీ పడి ఇసుక మాఫియా దగ్గర ఒక్కొక్క ట్రాక్టర్‌కు రెండు వేల రూపాయలు చెల్లించి ఇసుకను తీసుకుంటున్నారు.

**పోలీసులుకు, స్పందనలో ఫిర్యాదు చేసిన ఫలితం లేదు :** హంద్రీ నదిలో బోర్ల దగ్గర కూడా ఇసుకను తోడేస్తున్న విషయంపై తాను పోలీసులుకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని రైతు సుదర్శనం కన్నీటి పర్యంతమవుతున్నాడు. అంతే గాక తాను ఇది వరకే ప్రతి సోమవారం మండల స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేసిన ఎలాంటి ఉపయోగం లేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వాన కాలంలో సాగు చేసిన పంటలు అన్ని దెబ్బతిన్నాయని, అధిక వర్షాల కాలం భారీ నష్ట పోయాయని అన్నారు. కనీసం రబీ సీజన్‌లో నైన బోర్ల సాగు చేసుకోవాలనుకుంటే ఇసుక మాఫియా హంద్రీ నదిలో ఇసుకు తోడేస్తున్నారని ఆరోపించాడు. ఇప్పటికైన పోలీసులు స్పందించి మాఫియా చర్యలు తీసుకోవాలని రైతు సుదర్శనం ఆశాబావం వ్యక్తం చేశాడు.

## తరగతిగది అథారిత పరీక్షా కేంద్రం ఎంఇఓ పరిశీలించిన

**పగిడ్యాల, నవంబరు 2,ప్రభాతవార్త :** పగిడ్యాల జెడ్పీపాఠశాలలో బుధవారం తరగతిగది అథారిత పరీక్షా కేంద్రాన్ని ఎంఇఓ సుభాన్ పరిశీలించారు. నూతనంగా రాష్ట్రప్రభుత్వం పరీక్షలను బబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిడం జరిగింది. మొదటి రోజు జెడ్పీపాఠశాలలో 7వతరగతిలో నిర్వహిస్తున్న ఓఎంఆర్‌షీట్‌లో బబ్లింగ్ పూర్తిచేస్తునా న్నరాలేదా అనీ ఎంఇఓ పరిశీలించారు. బబ్లింగ్ తప్పనిసరిగా పూర్తిచేయాలనీ విద్యార్థులకు ఎంఇఓ సుభాన్ సూచించారు.

## పత్తివిత్తనాలపై శాస్త్రవేత్తలు పరిశీలన

**ఆలూరు,నవంబరు 2,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దహోతూరు గ్రామంలో రైతన్నలు తమ పంటపొలాల్లో పండించిన పత్తిపంటలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్‌నాయక్, సైన్‌టిస్టులు డిఆర్‌సి ఏడిఏ వెంకటేశ్వర్లు,ఏఓ శశిథర్‌రెడ్డిలు బుధవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తిపంటకు ముఖ్యంగా చిగురు ఆకులు ఎర్రబడడం,ముడతబడడం,ఎండిపోవడం జరుగుతుందని దీని ద్వార పూతరాలిపోవడం జరుగుతుందని వారి పరిశోధనలో తెలిపారు. అధిక వర్షాల వల్ల తలమాడు తెగలు,తామర పురుగులు సోకి మొక్కల్లో ఆకులు పసుపు వర్ణంలో వచ్చి రాలిపోతున్నాయని వాటికి వయ్యారి భామా,గడ్డి చేమంతి మొదలగు కలుపు మొక్కలు ఉండడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని రైతులకు సూచించారు. వీటి నివారణకు వ్యవసాయాధికారులను సంప్రదించి వివిధ రకాల మందులు పిచికారి చేయడం వల్ల వాటిని అదుపులోకి తీసుకుని పంటను కాపాడుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరగౌడ్,విఏఏ,రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను నిరసిస్తున్నాం

**బనగానపల్లె,నవంబర్2,ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపట్టే ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను నిరసిస్తున్నామని దొడ్డిదారిన బదిలీలను నిలిపివేసి కౌన్సిలింగ్ ద్వారా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మాధవస్వామి డిమాండ్ చేశారు.బనగానపల్లె ఏపీటీఎఫ్ డివిజన్‌స్థాయి సమావేశం బనగానపల్లె మండల ప్రధాన కార్యదర్శి సుంకన్న అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాధవస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం దొడ్డిదారిన బదిలీలు చేపడితే సీనియర్ ఉపాధ్యాయులకు మరియు మారుమూల గ్రామాలలో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తూ బదిలీల కోసం నిరీక్షిస్తున్నారని దగ్గర ఉన్న ప్లేస్‌లో సిఫార్సు బదిలీల వల్ల ఉపాధ్యాయులు వచ్చి చేరితే దూరంగా ఉన్న ఉపాధ్యాయులకు సరైన ప్లేస్ దొరకకా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు.ప్రభుత్వం ఇప్పటికైనా సిఫార్సు బదిలీలను ఆపివేసి వెంటనే కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు.ఏపీటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు మధుసూదన్‌రావు మాట్లాడుతూ బనగానపల్లె డివిజన్ కార్యాలయంలో ఉపాధ్యాయులు పట్టభద్రుల మండలి ఎన్నికలలో ఓటు నమోదు కొరకు ఏర్పాటు చేశామని డివిజన్‌లోని ఉపాధ్యాయులందరూ సద్వినియోగం చేసుకుని అందరు పేరు నమోదు చేసుకోవాలని కోరారు.జిల్లా ఉపాధ్యక్షులు జి.లింగమయ్య మాట్లాడుతూ నీతి నిజాయితీ గల ఒక్క రూపాయి డాక్టర్ అనిల్ చామల వెంకటప్రసాద్‌రెడ్డిని మీ మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఉపాధ్యాయుల మేధావులను కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు వాడాల సుబ్బరాయుడు,రామకృష్ణ,కె.రమేష్,చాంద్‌బాషా,కృష్ణయ్య,యల్ల సుబ్బయ్య,షఫి, అబ్దుల్ రహిమాన్,రఫిక్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలి

**దేవనకొండ,నవంబరు 2,ప్రభాతవార్త :** పట్టభద్రులు తమ ఓటు హక్కును నవంబరు 7వ తేదీలోపు నమోదు చేసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి రంగన్న,సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం నర్సారావులు అన్నారు. వామపక్షాలు బలపరుస్తున్న పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిపిఐ,ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన దేవనకొండ నందు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల నందు నిరుద్యోగులను,ఉపాధ్యాయులను కలిసి మార్చిలో జరగబోయే ఎన్నికల నందు తమ అమూల్యమైన ఓటు వేసేందుకు ముందుగా ఓటు హక్కును నమోదు చేసుకోవాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు అశోక్, నెట్టేకల్,సుల్తాన్,మధు,శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో బుద్ది చెప్పండి

**బేతంచెర్ల,నవంబర్2,ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరల నుండి ప్రతి విషయంలో ప్రజల పై అరాచక పాలన సాగిస్తున్న ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో కనివిని ఎరుగని రీతిలో బుద్ది చెప్పాలని డోన్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం బేతంచెర్ల పట్టణంలోని 15వ వార్డు నందు మండల టీడీపీ కన్వీనర్ యల్ల నాగయ్య,పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి,వార్డు కౌన్సిలర్ రామగోపాల్‌ల ఆధ్వర్యంలో జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను,ధరల పెరుగుదలను వివరించారు.రాబోవు కాలంలో మరింత భారాన్ని మోపి దోచుకుని దాచుకునేందుకు ప్రభుత్వ పెద్దలు యత్నిస్తున్నారని వారికి బుద్ది చెప్పకపోతే అరాచక పాలనకు అంతులేకుండా పోతుందన్నారు.ఖచ్చితంగా రాబోయే ఎన్నికల్లో బుద్ది చెప్పి టీడీపీకి పట్టం కట్టాలని ఆయన కోరారు.టీడీపీ నాయకులు మేకల నాగరాజు,రూబెన్,తిరుమలేష్ చౌదరి,ఆనంద్‌రెడ్డి, ఫయాజ్,ఉన్నం చంద్రశేఖర్,లోకేష్ గౌడ్,ఎస్.శ్రీనివాసులు,అధిక సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## జ్వాలవీరభద్రస్వామివారికి విశేష పూజలు

**శ్రీశైలంప్రాజెక్టు,నవంబర్02,ప్రభాతవార్త :** లోకకలా ్యణం కోసం దేవస్థానం బుదువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామివారికి(జ్వాలవీరభద్రస్వామివారికి)విశేష పూజలు నిర్వహించడం జరిగింది.ఆలయప్రాంగణంలోని మల్లికార్జున్వామివారికి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు.శిల్పాశాస్త్ర పరిబాషలో ఈ స్వామికి ఆఘోరవీరభ్రద్రమూర్తి అని పేరు కూడా ఉంది.కాగా ప్రతి బుదువారం ప్రదోష కాలంలో విశేష అబిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతిపూజను నిర్వహించబడింది.తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, ఫలు రకాల ఫలోదాకాలతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతోనూ విశేష అభిషేకం నిర్వహించడం జరిగింది.ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడింది.

## వరకట్నం కేసు నమోదు

**క్రిష్ణగిరి,నవంబర్2,ప్రభాతవార్త :** మండల పరిదిలోని కంబాలపాడు గ్రామానికి చెందిన మాదిగ సువార్త అనే వివాహిత తమ అత్తింటి వారు వరకట్నం కోసం వేదిస్తున్నారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుదవారం పిర్యాదు చేశారు.ఆమె ఇచ్చిన వివరాల మేరకు గత 5సంవత్సరాల క్రితం డోన్ మండలం ఆవులదొడ్డి గ్రామానికి చెందిన మాదిగ శివన్నతో వివాహం జరిపించారు.అప్పుడు వరకట్నం క్రింద 30వేల కట్నం,రెండు తులాల బంగారం ఇచ్చారు.మాకు సంతానం కలగలేదు.దీంతో అత్తింటి వారి వేదింపులు గురి చేస్తున్నారు.నీతో కాపురం చేయాలంటేలక్షరూపాయల కట్నం కావాలని నాభర్త,మరియు చంద్రమ్మ,మద్దిలేటి ఒత్తిడి చేస్తున్నారు.దీంతో పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారన్నారు.ఆమె ఇచ్చిన పిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు యస్.ఐ చంద్రశేఖర్‌రెడ్డి పెర్కొన్నారు.

## స్కూల్ హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

**పత్తికొండ,నవంబర్2,ప్రభాతవార్త:** పత్తికొండ మండలం చక్రాల గ్రామంలో మధ్యాహ్న భోజన పథకం బియ్యంను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు హోసూరు మధు డిమాండ్ చేశారు.మధ్యాహ్న భోజన పథకం బియ్యంను అమ్ముకుని సొమ్ము చేసుకున్న హెచ్‌ఎం ఉండడం సిగ్గుచేటన్నారు.పర్యవేక్షణ అధికారులు కూడా హెచ్‌ఎంకే వత్తాసు పలుకుతూ 30 బ్యాగ్‌ల బియ్యం అమ్ముకున్న సంబంధిత అధికారులు స్కూల్‌ను కూడా విజిట్ చేయలేకపోయారన్నారు.లోపాయికారి ఒప్పందం హెచ్‌ఎంతో కుమ్మక్కైనట్లు తెలుస్తుందన్నారు.ఇలాంటి హెచ్‌ఎంను తక్షణమే సస్పెండ్ చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.పత్తికొండ మండల పరిధిలో మధ్యాహ్న భోజన పథకం బియ్యం స్టాక్ పాయింట్‌ను పరిశీలించే నాధుడు కూడ లేరన్నారు.ఇలాంటి హెచ్‌ఎంలకు మధ్యాహ్న భోజనం చేసే వంట ఏజెన్సీలతో ఒప్పందాలు ఉన్నట్లు తెలుస్తుందన్నారు.మండలంలోని ప్రతి స్కూల్‌లో హెచ్‌ఎంల పై ప్రత్యేకంగా నిఘా వేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.కొన్ని స్కూళ్లల్లో గుడ్లు కూడా పక్కదారి పడుతున్నాయని ఆయన ఆరోపించారు.ఇలాంటి అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పేపర్ ప్రకటలకు పరిమితమయ్యారన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు.దీని పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## భక్తి మార్గంలో ఉండాలి

– ఉత్తరాది మఠం పీఠాధిపతులు సత్యాత్మ తీర్థులు

**చిప్పగిరి,నవంబరు 2,ప్రభాతవార్త :** ప్రజలు భక్తిమార్గంలో నడవాలని ఉత్తరాది మఠం పీఠాధిపతులు సత్యాత్మతీర్థులు అన్నారు. బుధవారం చిప్పగిరిలోని విజయదాసు 267వ ఆరాధన సందర్భంగా భక్తులకు ఉపదేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మం అందరిని కాపాడుతుందని దైవభక్తితో నడుచుకున్నప్పుడే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. అంతకుముందు సత్యేంద్ర తీర్థ పీఠాధిపతులకు విజయ దాసర నిర్వాహకులు సిహెచ్ ఎంకోబాదాస్,జగన్నాథ్ దాస్,శ్రీపతి దాస్,గోపాల్‌దాస్‌లు స్వాగతం పలికారు. ఉత్సవాల సందర్భంగా దాసు బృందావనాన్ని అందంగా అలంకరించారు.

## కల్వర్టు నిర్మించండి

**దేవనకొండ,నవంబరు 2,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన దేవనకొండకు చెందిన ఈడిగ కిష్టన్నగౌడ్ అనే రైతుకు వెలమకూరు రెవెన్యూలో నాలుగు ఎకరాల పొలం ఉన్నది అయితే ఆర్అండ్‌బి అధికారులు 3సం॥ల క్రితం పత్తికొండ-కర్నూలు రహదారి వేయడం జరిగింది. అయితే రోడ్డు ఎత్తుగా వేయడం వల్ల వర్షపునీరు ఎక్కడికి పోక తనకున్న నాలుగు ఎకరాల పొలంలోకి పై పొలాల నుంచి వర్షపునీరు రావడంతో గత ఐదేళ్లుగా చెరువులా తలపిస్తూ పంట వేసుకోవడానికి వీలు కాలేదని రైతు వాపోయాడు. దీనివల్ల సుమారుగా ఐదు సంవత్సరాల నుండి పంట వేయక లక్షల్లో తనకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తను భాదను దృష్టిలో ఉంచుకుని పొలంలో నీరు నిల్వ ఉండకుండ కల్వర్టు నిర్మించాలని రైతు ఆర్అండ్‌బి అధికారులను కోరుతున్నాడు.

## నగర పంచాయతీ అభివృద్దికి సహకరించండి

గూడూరు, నవంబర్ 2 (ప్రభాతవార్త) : గూడూరు నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని నగరపంచాయతీ వైఎస్ చైర్మన్ అస్లాం కోరారు. బుధవారం విజయవాడలో స్టేట్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్ ఐఎఎస్ సిఇవో స్పెషల్ ఆఫీసర్‌ను అస్లాం కలిసారు. ఈ సందర్భంగా అస్లాం ఇంతియాజ్ అహమ్మద్‌తో మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీ స్థితి గతులను వివరించారు. నిధులు లేక పూర్తిగా నగర పంచాయతీ అభివృద్ధికి నోచుకోవడం లేదని స్టేట్ అధికారితో మొరపెట్టుకున్నారు. ఈ మేరకు స్పందించిన ఉన్నతాధికారి గూడూరు అభివృద్ధికి అన్ని సహకారం అందిస్తానని హామిచ్చారు.

## ఒక మంచి మిత్రుడిని కోల్పోయా

**కర్నూలు విద్య, నవంబరు 2, ప్రభాతవార్త:** నా శ్రేయస్సు కోరుతూ నేను ఎదగాలనే కోరుకునే నామిత్రుడు ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి అనారోగ్యంతో మృతిచెందడం నా మనసు కలిచివేసిందని సీనియర్ పాత్రికేయులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన విడుదల చేసిన ప్రకటనలో తెలుపుతూ తను ఎప్పుడు చారసపడినా అన్నా ఎలా ఉన్నావు నీలాంటి వాళ్ల సమాజానికి ఎంతో అవసరం మంచి అవకాశాలు కల్పిస్తే నీవు వదులుకున్నావని ఎప్పుడు చెప్పేవారన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా అప్యాయంగా పలకరిస్తు చిరునవ్వులు చిందిస్తు ఎప్పుడైనా పలకరిస్తే చాలు నీలాంటి మిత్రుడు నాకు ఉండటం గర్వకారణంగా ఉందని గొప్పగా చెప్పెవారు అన్నారు. చల్లా భగీరథరెడ్డి ఏస్థాయిలో ఉన్నా తాను ఎంతో సంతోషించేవాడేనని కానీ నేడు ఆయన మరణం వార్త విని తట్టుకోలేకపోతున్నానని ఆయన ఆత్మశాంతించాలని ఆయన కోరారు.

## పంట నమోదు ముసాయిదా జాబితాపై గ్రామసభలు

**వెల్దుర్తి, నవంబర్2, ప్రభాతవార్త :** పంట నమోదు రైతుల ముసాయిదా జాబితాపై బుధవారం మండలంలోని వెల్దుర్తి,మల్లెపల్లి,సూదేపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.మండలంలోని సూదేపల్లి గ్రామసభలో మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాష పాల్గొని రైతులతో మాట్లాడారు. గ్రామసభలో రైతు భరోసా సిబ్బంది పంటనమోదు రైతుల ముసాయిదా జాబితాను చదివి వినిపిస్తా ర న్నారు. ఏమైనా తప్పులు ఉంటే రైతులు రేపటిలోపు సరిచేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు.ఈ గ్రామసభలు అన్ని గ్రామాల్లో గురువారం సైతం ఉంటాయన్నారు.రైతులు ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభలకు హాజరు కావాలని ఏఓ కోరారు.ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ముత్యాల శైలజదేవరాజ్,జడ్పిటిసి దాదిపోగు సుంకన్న,ఎంపిటిసిలు,ఇతర గ్రామాల సర్పంచ్‌లు,ఏఇఓలు రాధ,విలసిత,ఎంపిఇఓ రమాదేవి,విఎస్ఏ కలాం,విఏఏలు ప్రమీలారెడ్డి,శైలజ,రైతుభరోసా సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఏ I పరీక్షల సరళి పరిశీలన

**వెల్దుర్తి, నవంబర్2, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని ఎంజెపి(మహాత్మా జ్యోతిరావు పూలే)బాలికల పాఠశాలను బుధవారం ఎఫ్ఏ1 పరీక్షల సరళిని ఎంఇఓ ఇందిర పరిశీలించారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు.ఇంచార్జ్ ప్రిన్సిపల్‌ను పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినీలకు మౌలికవసతులు కల్పించాలని సూచించారు. మధ్యాహ్నభోజనం మెనూ ప్రకారం వడ్డించాలన్నారు.

## రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలి

**ఆదోని రూరల్,నవంబరు 2,ప్రభాతవార్త :** రాయలసీమ ప్రాంతంలో ఉన్న ప్రజాప్రతినిధులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా..ప్రజలపైన ప్రేమ ఉన్నా..రాబోయే ఎన్నికల్లో రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ప్రతి రాజకీయ పార్టీ కూడ మేనిఫెస్టోలో ఉంచే విధంగా చూడాలని సీమ విద్యార్థి సంఘం(ఆర్‌సిసి అనుబంధం) జిల్లా కార్యదర్శి బాలరాజు,రాష్ట్ర సలహాదారులు మధు,టౌన్ అధ్యక్షులు వినయ్, దుర్గాప్రసాద్‌లు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అట్టడుగు ప్రాంతమైన రాయలసీమపై చూపుతున్న వివక్షను ఖండిస్తున్నామన్నారు. మేధావులని చెప్పుకుంటున్న వాళ్లంతా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబరు 1న జరిపి పెద్దలు చేసిన శ్రీభాగ్ ఒప్పందాన్ని నీరుగారుస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం రాకముందే 1937 నవంబరు 16న మద్రాసులో జరిగిన ఈ ఒప్పందం కొందరి మేధావుల ఆలోచనగానే మిగిలిపోయిందని ఇదే కేవలం సంవత్సరానికి ఒకసారి మాత్రమే జరిపే ఆనవాయితీగా రాయలసీమలో ఉన్న మేధావులు కూడ మరిచిపోయారన్నారు. అసలు నిజంగా సీమకు కావాల్సింది ఏమిటని అలోచించడమే మానేశారన్నారు. యువతరానికి ఉపాధిని, ఉద్యోగాలను, రావాల్సిన నీటివాటాను,సీమలో ఐటి పరిశ్రమలను మరియు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలని వారు కోరారు.సీమ విద్యార్థి సంఘం కర్నూలు టౌన్ మహిళావిభాగం నాయకురాలు శృతి,షరీనా,నిహారిక,షరీఫా, సంజయ్,బాలనాయుడు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి వసతి గృహాల బిల్లులు చెల్లించాలి

– ఏబివిపి ఆలూరు బాగ్ కన్వీనర్ వినోద్

**ఆలూరు,నవంబరు 2,ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి,ఎస్‌టి వసతి గృహాల బిల్లులను వెంటనే చెల్లించాలని ఏబివిపి ఆలూరు బాగ్ కన్వీనర్ వినోద్ అన్నారు. బుధవారం పట్టణంలో అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వినోద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్‌సి,ఎస్‌టి,బిసి హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని,జీఓ 77ను రద్దు చేసి,ప్రైవేటు కళాశాలలో చదివే విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన మరియు వసతి దీవెన అందించాలన్నారు. మెగా డిఎస్‌సి విడుదల చేయాలని,రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో స్కాలర్‌షిప్,ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని,వివిధ ఎంట్రన్స్ కోచింగ్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కోచింగ్ అకాడమీలపై చర్యలు తీసుకోవాలని, డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని,పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్రంలోని హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు,కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి కార్యకర్తలు మహేష్,షాకీర్ తదితరులున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి

**ఆస్పరి,నవంబరు 2,ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండ మోసం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి,వైసిపి ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ది చెప్పాలని టిడిపి మండల ఉపాధ్యక్షుడు సుదర్శన్,సీనియర్ నాయకులు గోపాల్,నాయకులు సతీష్‌కుమార్‌లు అన్నారు.బుధవారం మండల పరిధిలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం ఎక్కువగా ఉందన్నారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చకుండ యువకుల పట్ల చిన్నచూపు చూస్తున్నారన్నారు. కావున పట్టభద్రులైన యువతీ, యువకులు వైసిపి పాలనపై రాబోవు రోజుల్లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి తగిన బుద్ది చెప్పాలన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా నిరుద్యోగ యువతీ,యువకులకు నిరుద్యోగ బృతి ఇచ్చి అండగా నిలిచిన వ్యక్తి మాజీ సిఎం చంద్రబాబు అని తెలియజేశారు.తెలుగు యువత మండల అధ్యక్షులు మారేష్,తిక్కన్న,శేఖర్,రామాంజిని,రాజేష్ తదితరులున్నారు.

## ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల నమోదు

**గడివేముల, నవంబర్02, ప్రభాతవార్త ;** మండలంలోని 5809 మంది రైతులకు చెందిన 19,790 ఎకరాల్లో ఈ యేడాది ఖరీఫ్లఓ సాగుచేసిన వివిధ పంటలపైన పంటల నమోదు కార్యక్రమం క్షేత్ర పరిశీలన, రైతుల యొక్క వేలిముద్రలు తీసుకుని సామాజిక తనిఖీ కొరకు బుధవారంనాడు సంబంధిత ఆర్‌బీకేలలో ప్రచురించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి హేమసుందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా నవంబర్ 3, 4వ తేదీల్లో ప్రతి ఒక్క ఆర్‌బీకే నందు గ్రామసభలు ఏర్పాటు చేసిన ఆర్‌బీకే నందు నమోదైన పంట మరియు విస్తీర్ణం వివరాలను చదువుతూ రైతులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే రైతులు ఫిర్యాదు పత్రంలో రాసి ఆర్‌బీకే సిబ్బందికి ఇవ్వాలని సూచించారు.

## 'లంపి స్కిన్ వ్యాధి పట్ల అందోళన చెందవద్దు ..'

**కొలిమిగుండ్ల, నవంబరు 2, ప్రభాతవార్త :** ఇటీవల పశువుల్లో అధికంగా వ్యాపిస్తున్న లంపి స్కిన్(ముద్ద చర్మం) వ్యాధి పట్ల పశు పోషకులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కొలిమిగుండ్ల పశు వైద్యాధికారిణి డా.పద్మావతి సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో తెల్ల జాతి పశువులకు ఇప్పటికే లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. ఇవటీల ఎర్రగుడి, నందిపాడు గ్రామాల్లో రెండు పశువులకు లంపి స్కిన్ వ్యాధి సోకిందని, అయితే వెంటనే సంభందింత పశువులకు వైద్య సేవలు అందించామని, పూర్తిగా నయమైనట్లు ఆమె తెలిపారు. ప్రస్థుతానికి కొలిమిగుండ్ల మండలంలో ఎటువంటి లంపి స్కిన్ వ్యాధి కేసులు నమోదు కాలేదని డా.పద్మావతి తెలిపారు.

## మద్యం కేసులలో పట్టుబడిన 146 వాహనాలు వేలం

**నందికొట్కూరు,నవంబర్ 2,ప్రభాతవార్త:** ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో మద్యం(ఎక్సైజ్) కేసులలో పట్టుబడిన వాహనాల వేలం కార్యక్రమం ఆత్మకూరు డియస్పీ శృతి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన ఆత్మకూరు పోలీసు స్టేషన్ నందు, 9వ తేదీన నందికొట్కూరు సర్కిల్ పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ నందు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లుగా రూరల్ సి.ఐ.సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో గెలుపొంది వాహనం దక్కించుకున్న వారు పాడిన వేలం పాట యొక్క డబ్బులతో పాటు జి,యస్టీ.చెల్లించాల్సి ఉంటుందన్నారు. బైకులు 131, ఆటోలు 10, కార్లు 5, మొత్తం 146వాహనాలు వేలంవేయడం జరుగుతుందని, వివరాలకు డియస్పీని సంప్రదించాలని సి.ఐ.తెలిపారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటేనే వ్యాధులు దూరం

– డాక్టర్ ఏ.ఎం.ఆదినాగేష్

**ఆదోనిలీగల్, నవంబర్02, ప్రభాతవార్త ;** ప్రతిఒక్కరు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే వ్యాధులు దూరంగా ఉంటాయని, ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణంలోని 'శ్రీతేజా నర్సింగ్ హోం' డాక్టర్ ఏ.ఎం.ఆదినాగేష్ తెలిపారు. బుధవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. వర్షాలు ఎక్కువగా పడడం వల్ల తాగునీరు కలుషితమై వివిధ రకాల వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. దీంతో దోమలు అధికమై మలేరియా, డెంగ్యూలాంటివి వస్తాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని చేతులకు బ్రాస్‌లు తొడగాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో వరదనీరు తాగడంతో కలరా, డయేరియా(అతిసారా)లు ప్రబలి తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. నీటిని వేడిచేసి చల్లార్చిన తర్వాత తాగాలన్నారు. వ్యాధి తీవ్రతరం కాకముందే సమీపంలోని డాక్టర్‌ను స్పందించి తగిన చికిత్సలు తీసుకోవాలన్నారు.

## ఫార్మేటివ్-01 పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎంఈఓ

**గడివేముల, నవంబర్02, ప్రభాతవార్త ;** మండలంలోని గని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఫార్మేటివ్-01 పరీక్షా కేంద్రాన్ని ఎంఈఓ రామకృష్ణుడు బుధవారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణ గురించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ యేడాది ఫార్మేటివ్ వన్‌ను క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్‌గా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ప్రశ్నాపత్రాన్ని ప్రభుత్వమే అందజేస్తుందని, 1 నుంచి 8వ తరగతి వారు జవాబును ఆబ్జెక్టివ్ తరహాలో ఓఎంఆర్ సీట్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఓఎంఆర్ షీట్లను విద్యార్థి పేరుతో సహా ప్రభుత్వమే ఇస్తుందని, అలాగే పరీక్షలు అనంతరం ఈ ఓఎంఆర్ షీట్లను జిల్లా కేంద్రానికి పంపి, రాష్ట్ర కార్యాలయంలో మూల్యాంకనం జరుగుతుందన్నారు. అనంతరం మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని, దీని ద్వారా విద్యార్థుల ప్రగతి తెలుస్తుందన్నారు. ఈ పరీక్షలను మండలంలోని అన్ని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

## 'రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు - ఎస్ఐ'



**కొలిమిగుండ్ల, నవంబరు 2, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తమవంతుగా చర్యలు చేపడుతున్నట్లు కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్‌రెడ్డి పెర్కొన్నారు. ప్రమాదాల నివారణ కోసం వాహన చోదకులకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహన చోదకులకు వివిధ రకాల జాగ్రత్తలు, నిభంధనలు తెలియజేస్తూ పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. మోటార్‌సైకిల్ పై వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, డ్రైవింగ్ చేయరాదని పెర్కొన్నారు. అతి వేగంగా వాహనాలు నడపరాదని, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణం చేయరాదని పెర్కొన్నారు.

## వసతి గృహాలలో సమస్యలు పరిష్కారించాలి



**నందికొట్కూరు, నవంబర్ 2, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాలలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారిచాలని ఎబివిపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేసి డిప్యూటి తహాసిల్దార్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఎబివిపి కళామంచి జిల్లా కన్వీనర్ నాగరాజు మాట్లాడుతు పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల బిల్లులు మంజూరు చేయాలి, వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలి, జీఓ నెం. 77ను రద్దు చేసి ప్రైవేట్ కళాశాలలో చదివే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన మరియు వసతి దీవెన అందించాలి, మెగా డియస్సీ విడుదల చేయాలి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు మరియు ఫీజురియంబర్స్‌మెంట్స్ విడుదల చేయాలి, వివిధ ఎంట్రెన్స్ కోచింగ్ పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కోచింగ్ అకాడమీలపై చర్యలు తీసుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## గులాబిరంగు పురుగుపై శాస్త్రవేత్తలు పర్యవేక్షణ

**ఆస్పరి, నవంబరు 2, ప్రభాతవార్త :** పత్తిపంటలో గులాబిరంగు పురుగు ఉదృతిని గమనించి సస్యరక్షణపై కెవికె శాస్త్రవేత్త రమేష్‌నాయక్ పర్యవేక్షించారు. బుధవారం మండల పరిధిలోని కారుమంచి, బిల్లేకల్, కైరుప్పుల గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం కర్నూలు డిఆర్‌సి కెవికె బనవాసి శాస్త్రవేత్తలు పత్తిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంటను గులాబిరంగు నుండి కాపాడాలంటే ఎకరాకు 8నుండి 10లింగాకర్షక బుట్టలు పొలంలో పెట్టుకోవాలన్నారు. బుట్టలు పెట్టుకున్న తర్వాత రోజుకు ఒక బుట్టలో 8పురుగులు చొప్పున వరుసగా మూడు రోజులు పడినట్లయితే రసాయనిక పురుగు మందు 1.5గ్రాములో తైయోడికర్ 20ఎంఎల్ ప్రొఫెనోఫాస్ 20ఎంఎల్ లీటరు నీటికి కలుపుకుని పిచికారి చేస్తే గులాబీరంగు పురుగు అదుపుచేయవచ్చన్నారు. అనంతరం డిఆర్‌సి ఏడిఎ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పత్తిపైరు 90రోజులపైన ఉన్నట్లయితే 0.5ఎంఎల్ లాంబ్డసైలోత్రిన్ ప్లస్ క్లోరాంట్రనిలిప్రోల్ లేదా 1.0మిలీ లాంబ్లాసైహాలోత్రిన్ లేదా 1.5మిలీ ఫెన్ ప్రోపాత్రిన్ లేదా 1.0మిలీ పైపర్‌మెత్రిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు వివరించారు. వ్యవసా యాధికారి మునెమ్మ, విహెచ్‌ఏలు బసవరాజు, సోనీ, సుగు ణ, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేష్‌నాయక్

## ఏళ్లనాటి ప్రభుత్వ పాఠశాల నాడు నేడు 30లక్షలు మంజూరు




సంజామల ప్రభుత్వ పాఠశాల

**కోవెలకుంట్ల, నవంబరు 2, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సంజామల్లో ఏళ్ల నాటి పాఠశాలకు ఎట్టకేలకు నాడు నేడు పథకముతో మోక్షం లబించింది. నాటి పెండేకంటి వెంకటసుబ్బయ్య స్వగ్రామమైన సంజామలలో ప్రభుత్వం పాఠశాలతో పాటు దానికి అనుసందానముగా జూనియర్ కాలేజిని కూడా ఏర్పాటు చేశారు. అయితే ఏళ్ల నాటి భవనాలు కావడముతో ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు వారికి పాటాలు బోదించే ఉపాధ్యాయులు నిత్యము భయం భయంతో ఉండేవారు ఇలాంటి తరుణంలో నేడు అదికారములో ఉన్న వైసిపి ప్రభుత్వం విద్యకు ప్రాదాన్యత కలిస్తు నాడు నేడు అనే పథకము ప్రవేశ పెట్టింది. దీనితో జిల్లాలోని అన్ని పాఠశాలలకు రెండు విడతలుగా నిదలు మంజూరు చేయడముతో పాఠశాల రూపు రేఖలే మారాయి. ముఖ్యంగా ఇవి ప్రభుత్వం పాఠశాలేనా అనే అశ్చర్యానికి గురి చేసేవిదంగా వాటిని అందముగా తీర్చిదిద్దారు అందులో బాగంగా మండల కేంద్రమైన సంజామల ప్రభుత్వం పాఠశాలకు నాడు నేడు రెండవ విడత కింద రూ 30లక్షలు మంజూరు చేశారు. ఈ నిదులతో పాఠశాల పై కప్పుఇతర వాటిని తయారు చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మొత్తం మీ ఏళ్ల నాటి సంజామల పాఠశాలకు నాడే నేడు పథకముతో మోక్షం లబించింది.

## సైబర్ సెక్యూరిటీ మీద అవగాహన సదస్సు

**కర్నూలు విద్య, నవంబరు 2, ప్రభాతవార్తః** రాయలసీమ విశ్వవిద్యాలయంలో సెనెట్ హాల్ నందు సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై రాయలసీమ విశ్వవిద్యాలయం మరియు వర్సిటి స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా వారు కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. వర్సిటి ఉప కులపతి ఆచార్య ఆనందరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరు సాంకేతిక మీద అవగాహన కలిగి పూర్తి రక్షణతో కూడిన మొబైల్ సెక్యూరిటి బ్యాంకింగ్ సెక్యూరిటి విధానాలను సైబర్ సెక్యూరిటి మీద పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. నేటి సమాజంలో సైబర్ నేరాలు పెరిగాయని, టెక్నాలజీ అధారిత అన్లైన్ మోసాలు, అంతర్జాల లింక్స్‌ను పంపి నగదు లావాదేవీల ద్వారా మోసపోతున్నారని విద్యార్థులు వాటికి అవగాహనతో ఉండాలని మోసపోవద్దని డిఎస్పీ కేవ్, మహేష్, సిఐ శేషయ్య చెప్పారు. బ్యాకింగ్ రంగంలో ఇప్పటికే ఓటీపి అధారిత లావాదేవీలు, సెక్యూరిటీతో అప్లికేషన్ విధానాలు పాస్వర్డు వివరాలు అన్ని సెక్యూరిటితో ఉండాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ అచార్య సంజీవరావు, రిజిస్ట్రార్ అచార్య మధుసూధనవర్మ, ప్రిన్సిపాల్ అచార్య కృష్ణారెడ్డి, అచార్య హరిప్రసాద్‌రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం

## ఓ పట్టభద్రుడా ఓటు హక్కును నమోదు చేసుకుందాం

**ఆస్పరి, నవంబరు 2, ప్రభాతవార్త :** పట్టభద్రుడా ఓటు హక్కును నవంబరు 7వ తేదీలోపు నమోదు చేసుకుందామని ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ రంగన్న, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షిలు అన్నారు. బుధవారం సిపిఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ వామపక్షాలు బలపరుస్తున్న పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని ఆస్పరిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం మరియు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులకు మీ మెదటి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కలిసి ప్రచారం చేయడం జరిగిందన్నారు. నిరుద్యోగులను, 2019 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తయిన వాళ్లను ఓటు నమోదు చేసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఆంజనేయ, రామాంజనేయ, మహానంది, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శులు రమేష్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డుగ్రహీత డీయస్పీకి ఘన సన్మానం



డీయస్పీ కె.ఎస్.వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆదోని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్

**ఆదోనిలీగల్, నవంబర్02, ప్రభాతవార్త ;** ఉత్తమ అవార్డుగ్రహీత ఆదోని డీయస్పీ కె.ఎస్.వినోద్ కుమార్‌కు బుధవారం గన సన్మానం జరిగింది. ఆదోని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ టూటౌన్‌లో డీయస్పీకి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డీయస్పీ చేసిన సేవలకు గానూ ఉత్తమ సేవా పురస్కారం లభించడం హర్షనీయమని దేవిశెట్టి ప్రకాష్ కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసుశాఖ డీజీపీ ఉత్తర్వులు జారీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. డీయస్పీ విధుల పట్ల అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం డీయస్పీ మాట్లాడుతూ దేవుడు తనకు ఇచ్చిన విధులను అంకితభావంతో చేశానని, ఈ ఉత్తమ సేవా పురస్కార అవార్డు రావడం తనకెంతో ఆనందాన్ని కలిగించింద న్నారు. ప్రజల సహకారం, దేవుడి ఆశీర్వాదం తనకు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు.

## జాతీయ అబాకస్‌లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న అక్షరశ్రీ డైరెక్టర్ మేఘనాథ్‌రెడ్డి

**ఆదోనిటౌన్, నవంబర్02, ప్రభాతవార్త ;** చెన్నైలో నిర్వహించిన జాతీయ ఓ బ్రైన్ ఫెస్ట్ అబాకస్ పోటీల్లో జాతీయస్థాయిలో రెండో స్థానంలో స్థానిక అక్షరశ్రీ విద్యార్థి వెండి పతకం కైవశం చేసుకుంది. ఈ మేరకు పాఠశాల డైరెక్టర్ మేఘనాథరెడ్డి విద్యార్థిని కౌసర్‌ను అభినందించారు. తమ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించేలా ప్రోత్సహిస్తున్నామ న్నారు. చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని చెప్పారు. అలాగే విద్యార్థినిని తల్లిదండ్రులు అబ్దుల్‌రషీద్, షహీనాఅంజుంను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాఘవేంద్రప్రసాద్, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోండి

**తుగ్గలి, నవంబరు 2, ప్రభాతవార్త :** త్వరలో జరగబోయే పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ తిరుపాల్‌నాయుడు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా మండలంలోని గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ప్రతిఒక్కరు గ్రాడ్యుయేట్ ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు నమోదుకు ఈ నెల 7న చివరి తేదీ కావడంతో 2019అక్టోబరు 31లోపు డిగ్రీ లేదా డిగ్రీకి సమానమైన డిప్లమా కోర్సులు పూర్తి చేసుకున్న వారు తమ ఓటును సమీప తహాశీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కును పొందిన వారు ఎవరూ తమ ఓటును అమ్ముకోవద్దని కోరారు. ఒక్కసారి ఓటును అమ్ముకుంటే దేశ భవిష్యత్తును తాకట్టు పెట్టినట్లు అవుతుందన్నారు. తద్వార కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి పార్టీ తరుపున పోటీ చేస్తున్న భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఆయన కోరారు.

## జిల్లాస్థాయికీ ఎంపికైన మోడల్‌స్కూల్ విద్యార్థులు



**పగిడ్యాల, నవంబరు 2, ప్రభాతవార్త :** జిల్లాస్థాయి క్రీడాపోటీలకు పగిడ్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుజన తెలిపారు. బుధవారం అమె మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో నందికొట్కూరు మండలం కొణిదేల జెడ్పీపాఠశాల నిర్వహించిన క్రీడా పోటీల్లో అండర్ -17 విభాగంగా 10వతరగతి చదువుతున్న ఫషి అథెలిటిక్స్‌పోటీలకు కబడీ పోటీలకు బి.గోకుల్, శివకుమార్, షటిల్ పోటీలకు నిషికుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుజన తెలిపారు. జిల్లా స్థాయి క్రీడాపోటీకు ఎంపిక విద్యార్థులను ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

**పగిడ్యాల జెడ్పీపాఠశాల విద్యార్థి జిల్లాస్థాయి కబడీ పోటీలకు ఎంపిక :** పగిడ్యాల జెడ్పీపాఠశాలలో 9వతరగతి చదువుతున్న పవన్‌కుమార్ జిల్లాస్థాయి కబడీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూధనరావు తెలిపారు. జిల్లా స్థాయి కబడీ పోటీలకు ఎంపికైన పవన్‌కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పొడిగింపు

**కర్నూలు విద్య, నవంబరు 2, ప్రభాతవార్తః** కమిషనర్ మైనార్టీ సంక్షేమశాఖ తాడేపల్లి గుంటూరు జిల్లా వారి అదేశముల మేరకు కేంద్ర ప్రభుత్వపు స్కాలర్ షిప్‌లు 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి అన్లైన్‌లో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ నందు విద్యాసంస్థలు ప్రీ మెట్రిక్, బేగం హజరత్ మహల్ చివరి తేది 15-11-2022 వరకు పొడిగించడమైంది. పాఠశాలల యాజమాన్యం వెరిఫికేషన్ చేయుటకు చివరి తేది 30-11-2022 లోపల చేయాల్సిందిగా తెలియజేశారు. పోస్టు మెట్రిక్ మరియు మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్ చివరి తేది 30-11-2022 వరకు పొడిగించడమైందన్నారు. కళాశాల యాజమాన్యం వెరిఫికేషన్ చేయడానికి చివరి తేది 15-12-2022 లోపల చేయాల్సిందిగా తెలియజేశారు.

## రోడ్ ట్యాక్స్ కట్టని వాహనాలపై చర్యలు తీసుకుంటాం



వాహనాల ధృవపత్రాలు పరిశీలిస్తున్న ఎంవిఐ సిసిర దీప్తి

**చిప్పగిరి, నవంబరు 2, ప్రభాతవార్త :** రోడ్ ట్యాక్స్ చెల్లించకుండ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుని వాహనాలను సీజ్ చేస్తామని ఆదోని ఎంవిఐ సిసిర దీప్తి వాహనదారులకు తెలిపారు. బుధవారం చిప్పగిరిలోని అంబేద్కర్ కూడలి వద్ద ఆలూరు-గుంతకల్లు రహదారిపై వాహనాలను తనిఖీ చేసి ధృవపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవిఐ సిసిర దీప్తి మాట్లాడుతూ చిప్పగిరి మండలంలో రోడ్ ట్యాక్స్ కట్టకుండ ఎనిమిది కెరియర్ వాహనాలు నడుపుతున్నారని వారు తొందరలో రోడ్ ట్యాక్స్ కట్టి వాహనాలు నడుపుకోవాలని లేనియడల వాహనాలను సీజ్ చేస్తామని వాహనదారులకు హెచ్చరించారు. వాహనాలకు రోడ్ ట్యాక్స్ కట్టకుండ నడపడం నేరమని కనుక వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి జయంతి



**గోనెగండ్ల నవంబరు 2 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్ల స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మాజీ మంత్రి కీ.శే బీవీ మోహన్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా మండల టీడీపీ నాయకులు నిర్వహించారు. ముందు బీవీ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు, నూరఅహ్మద్, టౌన్ అధ్యక్షులు రమేష్‌నాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, చిన్ననేలటూరు నాగన్న ఎస్ఎన్ మాబువలి, ఫక్రుద్దీన్, మీన్నలాలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సృష్టికర్త నందమూరి తారక రామరావుకు ఇష్టమైన వ్యక్తిగా, ఉమ్మడి తెలుగు రాష్ట్రల మంత్రి సుపరిచితుడు అన్నారు. నాయకులకు, కార్యకర్తలకు అప్యాయంగా పలకరించే వ్యక్తిత్వం అయనకే సొంతం అని తెలిపారు. ఎంత అలకబూచినా కార్యకర్తని సైత్యం బుజాన చేయి వేసి మెప్పించే తత్వం విశ్వమోహనుడిది. అభివృద్ధి అంటే బీవీ, ఎమ్మిగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచి ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న నాయకుడు బీవీ మోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయంలో 73వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారని అన్నారు. బీవీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈక్యార్రమంలో రామేష్ ఆచారి, ఫక్రుద్దీన్, ఉట్ల రంగస్వామి, ఐరన్‌బండ భాష, పొట్ట రామాజినేయులు, వీరంపల్లి సంజీవయ్యఅచారి, అలువాల నూర, హెచ్ కైరవాడి పెద్దయ్య, మందకల్లు, నారాయణ, సందీప్‌నాయుడు, షేక్షవలి, తదితరులున్నారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**వెల్దుర్తి, నవంబర్2, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణ సమీపంలోని జర్నలిస్టుకాలనీలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటే శ్వరసద్గురుసాయినాథఅయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారణ భక్తులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం పురస్కరించుకొని స్వామికి అష్టోత్తర పూజలతో పాటు అభిషేకం చేశారు. అయ్యప్పకు మహామంగళహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్పభక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి



వెల్లడిస్తున్న వాల్మీకి ప్రజాసంఘాల నాయకులు

**నంద్యాల, నవంబరు 2, ప్రభాతవార్తః** వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలనీ జాతీయ పోరాట సమితి ఉపాధ్యక్షులు బోయ రామకృష్ణ, జాతీయప్రధాన కార్యదర్శి గోవిందనాయుడు. జాతీయ ఐక్యపోరాట సమితి జనరల్ సెక్రటరీ పి రమణలు అన్నారు. బుధవారం నంద్యాల జంబులాపరమేశ్వరీ దేవాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా వాల్మీకులు ఎస్టీ అంశంపై అనేక పోరాటు చేశారని గుర్తుచేశారు. ప్రాంతీయ వ్యత్యాసం తొలగించాలనే ఉద్యమాల ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం గవర్నర్ ప్రసంగంలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తామని ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక తయారుచేసి పంపిస్తామన్నారు. 2016 సంవత్సరం ఆంధ్రయూనివర్శిటి అంత్రోపాలజీ డిపార్టుమెంటు నుంచి సత్యపాల్‌తో పాటు నలుగురు స్కాలర్స్‌ను నియమించడం జరిగిందన్నారు. 11 నెలల పాటు సుదీర్ఘంగా ఆంధ్రరాష్ట్రవ్యాప్తంగా వాల్మీకుల స్థితిగతులు, అచార్యవ్యవహారాల పట్ల అధ్యాయనం చేశారని తెలిపారు. అప్పటి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారం శివాజీ నేత్రత్వంలో కమిషన్‌ను ఏర్పాటుచేయడం కూడ జరిగిందని గుర్తుచేశారు. కమిటీ, కమిషన్ రిపోర్టు అధారంగా కేబినెట్‌లో తీర్మాణం అనంతరం ఉభయ చట్టసభల్లో తీర్మాణంతో పాటు గవర్నరు సిఫారసు లేఖలు కూడ పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకుల పట్ల చిత్తశుద్ధితో అనాడు ప్రభుత్వం చేసిన తీర్మాణాన్ని మరోసారి కేంద్రానికి, దేశ ప్రధానికి నివేదిక పంపి వాల్మీకులకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. కొత్త జీఓల ద్వారా కాలయాపన చేయకుండా ఎస్టీల చిరకాల కోరిక గుర్తిస్తారని వారు కోరారు. తోటి గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలకు ఒక్కటే విన్నపం. గోత్రనామాలు ఒక్కటే మాకు మీకు ఎలాంటి అభిప్రాయబేదాలులేవన్నారు. ప్రాంతీయ వ్యత్యాసం తొలగించమని మాత్రమే కోరున్నట్లు తెలిపారు. ఎరుకలి, సుగాలి సోదరుల పట్ల ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపి శివన్న, కోడుమూరు శ్రీను, చాబోలు ధనుంజయ్, సంగపేట శివ, బుజ్జి, కాండ్లపల్లె మల్లి, వెంకటేష్, బాలు, మద్దిలేటి, నాగేష్, కేశాలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపిద్దాం



ఓటునమోదు గురించి అవగాహన కల్పిస్తున్న భూమిరెడ్డి సాయి శ్రీనివాసరెడ్డి

**బండిఆత్మకూరు, నవంబరు 2, ప్రభాతవార్తః** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అదిష్టానం నిర్ణయించిన భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్సీ అభ్యర్థి తనయుడు భూమిరెడ్డి సాయి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు బుడ్డారాజశేఖర్‌రెడ్డి అదేశాల మేరకు బండిఆత్మకూరుమండలం టిడిపి నాయకులు తాటికొండ బుగ్గరాముడు, తాటికొండ మహేష్‌బాబు, ఎర్రలింగారెడ్డి, కలీల్‌బాష, గుండుగారి పెద్ద లింగారెడ్డి, ముజీబ్‌ల అధ్వర్యంలో పట్టభద్రులకు 2023 మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటుహక్కు నమోదు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సాయి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులైనవారందరిని ఓటుహక్కు కల్పించుకునే విధంగా ప్రొత్సహించాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్సీ మృతికి ఎమ్మెల్యే రామిరెడ్డి సంతాపం

**బనగానపల్లె, నవంబర్2, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు చల్లా భగీరధరెడ్డి(46) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందడం బాధకరమని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మరియు ఆయన సోదరులు, వైసీపీ సీనియర్ నాయకులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డి, అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. చల్లా భగీరధరెడ్డి అవుకు మండలంలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అలాగే పార్టీకి మంచి సేవలను అందించారని వారు గుర్తు చేసుకున్నారు. భగీరధరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్ధిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కేసును విచారణ జరిపి ఎత్తివేయాలి

:- డిఎస్‌పి శ్రీనివాసులును భాదితులతో కలిసి వినతిపత్రం అందించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోందిమడుగుల టిఎం రమేష్ మాదిగ



**పత్తికొండ, నవంబరు 2, ప్రభాతవార్త :** మాదిగ పెద్దయ్యపై అక్రమంగా తప్పుడు ఫిర్యాదుతో నమోదు చేసిన కౌంటర్ కేసును విచారణ జరిపి ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోందిమడుగుల టిఎం రమేష్ మాదిగ అన్నారు. బుధవారం డిఎస్‌పి శ్రీనివాసులును భాదితులతో కలిసి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోందిమడుగుల టిఎం రమేష్ మాదిగ వినతిపత్రం అందచేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దేవనకొండ మండల పరిధిలోని కరివేముల గ్రామంలో ఆగస్టు 15న సాయంత్రం 5.30గంటల సమయంలో తెలుగు సుధాకర్ పండ్ల బంకు దగ్గర పబ్లిక్ రోడ్డులో మాదిగ పెద్దయ్య నిలబడుకుని ఉంటే ఎందుకురా మాదిగ నా కొడకా మా పండ్ల బంకు దగ్గర నిలబడుకుని ఉన్నావ్..నువ్వు మా పండ్ల బంకు దగ్గర నిలబడుకుని ఉంటే మా పండ్లు కొనడానికి ఎవ్వరు రారు..ఇక్కడి నుండి వెళ్లిపో అంటూ మాదిగ పెద్దయ్యను దూషించడంతో ప్రశ్నించిన పెద్దయ్యపై తెలుగు సుధాకర్, తెలుగు మల్లీ, తెలుగు భాస్కర్‌లు ముగ్గురు మూకుమ్మడిగా కులవివక్షత, అంటరానితనంతో విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. అక్కడే ఉన్న పెద్దయ్య తండ్రి ఎందుకు మా వాడిని కొడుతున్నారని దాడి చేసిన వ్యక్తులను అడ్డు చెప్పి ప్రశ్నించడంతో మీవాడు మా పండ్ల బంకు దగ్గర నిలబడుకుని ఉన్నాడు మీరు అంటరాని కులం వారు అంటూ అడ్డు చెప్పిన పెద్దయ్య తండ్రిపై దాడి చేయడానికి ప్రయత్నించారన్నారు. ఈ దాడిలో గాయాలపాలైన మాదిగ పెద్దయ్య నొప్పులు తాళలేక ఆసుపత్రికి పోయి మెడిసన్ తీసుకున్నాడన్నారు. అయినా నొప్పులు తగ్గకపోవడంతో పత్తికొండ జనరల్ హాస్పిటల్‌కి పోయి డాక్టర్ల ద్వార చికిత్స తీసుకుని అనంతరం దాడి చేసిన వ్యక్తులపై దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి భాదితుడు పోతే ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి భాదితుడికి అండగా ఉండాల్సిన ఎస్ఐ పంచాయతీ చేసుకో అంటూ ఫిర్యాదు తీసుకోకుండ భాదితులపై నిర్లక్ష్యం చేయడం జరిగిందన్నారు. 45రోజులుగా స్టేషన్ చుట్టూ తిరిగినా కేసు నమోదు చేయలేదని జరిగిన ఘటన దేవనకొండ మండల ఎమ్మార్పీఎస్ నాయకుల దృష్టికి తీసుకురావడంతో జరిగిన సంఘటన పత్రికల్లో రావడంతో ఎస్ఐ 17-10-2022న ఎఫ్ఐఆర్ 137/2022సెక్షన్ 323ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేశాడన్నారు. ఆగుస్టు 15న జరిగే 16న జరిగినట్లు ఎస్ఐ ఫిర్యాదులో తేదీ మార్చి కేసు నమోదు చేశాడన్నారు. ఈ కేసును నీరుగార్చేందుకు దాడిచేసిన నింధితుడు సుధాకర్ భార్యతో తప్పుడు ఫిర్యాదు తీసుకుని కౌంటర్ కేసు ఎఫ్ఐఆర్ 139/2022 సెక్షన్ 323,509కేసు అక్రమంగా నమోదు చేశారన్నారు. ఈ కేసును సమగ్ర విచారణ జరిపి ఎత్తివేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కాజీపురం రామాంజనేయులు మాదిగ, చిప్పగిరి మండల అధ్యక్షుడు ప్రభాకర్ మాదిగ, కరివేముల పెద్దయ్య, అబ్రహం తదితరులున్నారు.

## 7న దుర్గా భోగేశ్వరుడి కళ్యాణం

**గడివేముల, నవంబర్02, ప్రభాతవార్త ;** గడివేముల మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని శ్రీ దుర్గా భోగేశ్వర ఆలయంలో ఈనెల 7వ తేదీన దుర్గాసమేత భోగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ సోమవారం తెలిపారు. పౌర్ణమి రోజు చంద్రగ్రహణం కారణంగా కార్తీక మాసం రెండో సోమవారం స్వామివారి కళ్యాణ మహోత్సవం మేళతాళాల నడుమ వేద మంత్రోచ్ఛఱణలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రగ్రహణం సందర్బంగా 8వ తేదీన మంగళవారంనాడు ఆలయం మూసివేస్తామని, గ్రహణం వీడిన తర్వాత ఆలయ సంప్రోక్షణ శుద్ధి కార్యక్రమాల అనంతరం స్వామి దర్శనాలకు భక్తుల అనుమతి ఉంటుందని భక్తులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు



పంటపొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

**దేవనకొండ, నవంబరు 2, ప్రభాతవార్త :** పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కెవికె బనవాసి శాస్త్రవేత్త రమేష్‌నాయక్, ఏడిఏ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం దేవనకొండ మండలంలోని పత్తిపంట పొలాలను కెవికె బనవాసి శాస్త్రవేత్త రమేష్‌నాయక్, ఏడిఏ వెంకటేశ్వర్లు, ఏఓ శశిథర్‌రెడ్డిలు సందర్శించడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీరంగు పురుగు ఉదృతిని గమనించినట్లు తెలిపారు. తగిన సస్యరక్షణ చర్యలు పాటించి ఈ పురుగు ఉదృతిని తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎకరాకు 8నుండి 10లింగాకర్షక బుట్టలను పొలంలో అమర్చుకోవాలన్నారు. బుట్టలు పెట్టుకున్న తర్వాత రోజుకు ఒక బుట్టలో 8పురుగులు చొప్పున వరుసగా మూడు రోజులు పడినట్లయితే రసాయనిక పురుగు మందులు పిచికారి చేసుకోవాలన్నారు. పురుగు ఉదృతిని బట్టి మందులు పిచికారి చేసుకోవాలన్నారు. సింథటిక్, పైరిత్రాయిడ్ మందులు ఎక్కువగా పిచికారి చేయకూడదన్నారు. ఈ మందులను ఎక్కువగా పిచికారి చేయడం వల్ల రసం పీల్చే పురుగుల ఉదృతి ఎక్కువవుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ యోగేంద్ర, విఏలు, విహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

## మచ్చలేని మహానాయకుడి కీ.శే.బివి మోహన్‌రెడ్డి



**నందవరం, నవంబరు 2, ప్రభాతవార్తః** మండల కేంద్రమైన నందవరంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బివి మోహన్‌రెడ్డి 73వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటిచారు. మచ్చలేని మహానాయకుడని పార్టీ నాయకులు మాధవరావు దేశాయి, ముగతి ఈరన్న గౌడ్‌లు తీపిరొట్టెను కత్తిరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచిన మా పెద్దాయన తన రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగాల ఏలిన మహనీయుడన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసి కార్యకర్తలకు నాయకులకు, ప్రజలకు నేనున్నానని భరోసా ఇచ్చిన ప్రజానాయకుడు, బడుగు, బలహీనవర్గాల అశాజ్యోతి రాజకీయరంగంలో మీకు మీరేసాటి అనిపించేలా రాజకీయం చేశారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్నరాముడు, కాశీం వలి, వెంకటరామిరెడ్డి, రఘుమూర్తిస్వామి, నారాయణరెడ్డి, లక్ష్మన్న, గోపాల్, దావీదు, విశ్వనాథ్, వీరేష్, ఆదిశేషు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

